TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 138 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.12.12.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## హస్తం హవా

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో నెగ్గి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకుంది. గురువారం జరిగిన పోలింగ్‌లో 3,834 సర్పంచి పదవులకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డు సభ్యుల స్థానాలకు 65,455 మంది పోటీ పడ్డారు. తుది వార్తలు అందే సమయానిక కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 2,270 స్థానాల్లో గెలుపొందారు. బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులు 1,147 స్థానాల్లో, బీజేపీ 185 చోట్ల, ఇతరులు 516జూ స్థానాల్లో విజయం సాధించారు. ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గణనీయ సంఖ్యలో స్థానాలు గెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో సహజంగానే ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. సిద్దిపేట జిల్లాల్లో బీఆర్ఎస్ మెజారిటీ స్థానాలు దక్కించుకుంది. అలాగే మరో మూడు జిల్లాల్లో కూడా ఆ పార్టీ కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చింది. మొదటి విడత ఫలితాల అంచనాల ప్రకారం, వచ్చే రెండు విడతల్లో పోటీ మరింత హోరాహోరీగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఏకగ్రీవం, నామినేషన్లు దాఖలు కాని పంచాయతీలను మినహాయిస్తే దాదాపు 50 శాతం స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే గెలుపొందారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేశారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని భావిస్తున్నారు. రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం– అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. రానున్న రెండు, మూడు విడతల్లో మరింత మెరుగైన ఫలితాలను రాబట్టాలని ఆ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది. గ్రామ స్థాయిలో బీఆర్ఎస్ బలంగానే ఉందనడానికి ఈ ఫలితాలు సాక్ష్యంగా నిలుస్తాయని ఆపార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో బీజేపీ కూడా గతం కంటే బలాన్ని పెంచుకున్నట్టు తెలుస్తోంది. 2019లో మొత్తం 12,751 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా, అప్పటి అధికార టీఆర్ఎస్ (బీఆర్ఎస్) 7,774 పంచాయతీలను కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 2,709 గ్రామాలకే పరిమితమైంది. బీజేపీ 150 గ్రామ పంచాయతీల్లో నెగ్గింది. ఆ ఎన్నికల్లో ఇతరులు 2105 గ్రామపంచాయతీల్లో విజయం సాధించారు. ప్రస్తుతం తొలి విడత పోలింగ్ ఫలితాలు మాత్రమే వెల్లడయ్యాయి. మరో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఫలితాల ప్రభావం ఆ ఎన్నికలపై ఉంటుందని రాజకీయ




విశ్లేషకులు భావిస్తున్నారు. వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ మెజారిటీ ఫలితాలు కాంగ్రెస్‌నే వరించాయి. వీటి తుది ఫలితాలు వెల్లడి కావల్సి ఉంది.

ప్రజల విశ్వాసానికి నిదర్శనం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘనవిజయం సాధించటంపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలవటం, తమ ప్రభుత్వం పట్ల విశ్వాసానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని తెలిపారు.

## తెలంగాణ భవిష్యత్‌కు దిక్సూచి

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్ ముఖచిత్రాన్ని డాక్యుమెంట్ ఆవిష్కరించిందని ప్రశంసించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను సీఎం వారి నివాసాల్లో కలిసి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో సీఎం వెంట మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, సురేశ్ షెట్కార్, మందాడి అనిల్ కుమార్, పోరిక బలరాం నాయక్ ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారి మధ్య చర్చ కొనసాగింది. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సీఎంను ప్రశంసించారు. అలాగే ఈ నెల 13వ తేదీన మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు అగ్రనేతలను ఆహ్వానించినట్టు సీఎం తెలిపారు.

సీఎంకు ఎంపీల అభినందనలు..

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఘనంగా నిర్వహించడంతో పాటు రాష్ట్రానికి రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీలు అభినందనలు తెలిపారు. అగ్రనేతలతో భేటీ అనంతరం మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్‌కు వెళ్లారు. అక్కడ ఆయనకు ఎంపీలు అభినందనలు చెప్పారు. దాదాపు గంట పాటు సీఎం పార్లమెంట్‌లోనే గడిపారు. పలు పార్టీలకు చెందిన ఎంపీలు సీఎం రేవంత్ రెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పార్లమెంట్ నుంచి



నేరుగా ఎయిర్ పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ తిరిగి బయలుదేరి వెళ్లారు.

మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి సీఎం నివాళి..

రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అని కొనియాడారు.

## 84.28 శాతం పోలింగ్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా 189 మండలాల్లోని 3,834 పంచాయతీల్లో గురువారం జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 84.28 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.88 శాతం, ఆ తర్వాత మూడు జిల్లాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ జరిగింది. నల్లగొండలో 90.53, సూర్యాపేటలో 90.18, ఖమ్మంలో 90.16 శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 71.79 శాతం, ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 75.25, జగిత్యాలలో 77.68, ములుగులో 78.65 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 21.07 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 53.04 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చివరి రెండు గంటల్లో 30 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడంతో మొత్తం 84.28 శాతానికి చేరుకుంది. ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 53,57,277 మంది ఓటర్లకు గాను 45,151,41 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 21,99,267 మంది పురుషులు (84.16 శాతం), 23,157,96 మంది మహిళలు (84.40 శాతం), 78 మంది ఇతరలు (41.27 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికలసంఘం తెలిపింది. .

మూడు స్థానాల్లో లాటరీ ద్వారా ఫలితాలు

మూడు పంచాయతీ స్థానాల్లో ఇరువురు అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో అధికారులు లాటరీ ద్వారా విజేతను ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మక్కపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులకు 148 ఓట్లు వచ్చాయి. దాంతో, విజేతను తేల్చడం కోసం అధికారులు లాటరీ తీశారు. ఈ లాటరీలో బీఆర్ఎస్ అభ్యర్థి ఇండ్ల రాజయ్య సర్పంచ్‌గా ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం చిన్న ఎల్క చెర్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు 212 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్‌లోనూ ఇద్దరికీ సమాన ఓట్లు రావడంతో అధికారులు.. టాస్ వేశారు. అందులో కాంగ్రెస్ అభ్యర్థి మరాఠి రాజ్‌కుమార్‌ను అదృష్టం వరించింది. ఇక రేగోడ్ మండలం కొండాపూర్‌లో ఒక్క ఓటు తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి బేగరి పాండరి గెలుపొందారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సూరంపల్లిలోనూ లాటరీ తప్పలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు సమానంగా 276 ఓట్లు వచ్చాయి. లాటరీ తీయగా బీఆర్ఎస్ బలపర్చిన మైలారం పోచయ్య సర్పంచ్‌గా ఎంపికయ్యారు.

## లొంగిపోండి ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ బ్యూరో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టడీ విచారణను సుప్రీంకోర్టు అనుమతించింది. నేడు(శుక్రవారం) ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ఆఫీసర్ పి. వెంకట గిరి(ఏసీపీ) ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అయితే కస్టడీ సమయంలో ప్రభాకర్ రావుపై ఫిజికల్ టార్చర్ చేయకుండా విచారణ చేయాలని సూచించింది. అలాగే మందులు, ఇంటి నుంచి భోజనానికి అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పిటిషనర్ ప్రయోజనాలను, అదే సమయంలో విచారణను సమతుల్యం చేయడానికి తాము ప్రయత్నిస్తున్నట్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. అప్పటి వరకు ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేయమని, విచారణ ముగించకుండా అలాగే హోల్డ్‌లో ఉంచుతామని పేర్కొంది. గురువారం ఈ పిటిషన్ పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జి) తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూత్రా, ప్రభాకర్ రావు తరపున న్యాయవాది రంజిత్ కుమార్‌లు వాదనలు వినిపించారు.





జడ్జీలు ఎల్‌డబ్ల్యూడీ కేటగిరి కిందకు వస్తారా?

తొలుత పిటిషనర్ తరపు రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తిగా కట్టు కథ అని ఆరోపించారు. పొలిటికల్ కక్ష సాధింపులో భాగంగా ప్రభాకర్ రావును ఇందులో ఇరికించారన్నారు. ఈ కేసులో ఏ2, ఏ3, ఏ4, ఏ5, ఏ6లుగా ఉన్న ప్రణీత్ రావు, భుజంగ రావు, మేకల తిరుపతన్న, రాధాకిషన్ రావు, శ్రవణ్ కుమార్‌గా చేర్చినట్టు చెప్పారు. వీరిలో శ్రవణ్‌కుమార్ సుప్రీంకోర్టు నుంచి ముందుస్తు బెయిల్, మిగిలిన అధికారులు హైకోర్టు, ట్రయల్ కోర్టుల నుంచి బెయిల్ పొందినట్టు తెలిపారు. ఎస్ఐబీ చీఫ్‌గా కేవలం వామ పక్ష తీవ్రవాదం(ఎల్ డబ్ల్యూఈ) కు సంబంధించిన సమాచారాన్ని రికార్డు చేయడం వీరి బాధ్యతని అన్నారు. ఇందుకు సంబంధించి టెలికం చట్టాలు, టెలిగ్రాఫ్ రూల్ 17, ఐటీ రూల్ 22 లు ఉన్నాయన్నారు. మధ్యలో తుషార్ మెహతా జోక్యం చేసుకొని జడ్జీలు కూడా ఎల్‌డబ్ల్యూడీ కేటగిరిలోకి వస్తారా? అని ప్రశ్నించారు. ఇందుకు రంజిత్ కుమార్ స్పందిస్తూ%ొ% అసలు జడ్జీల ఫోన్ ట్యాపింగ్ అనేది పూర్తిగా అవాస్తవం అని కోర్టుకు నివేదించారు. దీనిపై కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో అన్ని అంశాలను పొందుపరిచినట్టు చెప్పారు. మరోవైపు చీఫ్ సెక్రెటరీ నేతృత్వంలోని జీఏడీ సెక్రెటరీ, లా సెక్రెటరీతో కూడిన ఎఫెక్స్ బాడీ ప్రతి రెండు నెలలకు ఒకసారి ఎల్‌డబ్ల్యూడీ విధానాన్ని మానిటరింగ్ చేస్తుందన్నారు. 27.9.23 నుంచి 30.11.2023లో ఈ కమిటీ చేసిన రివ్యూలో పూర్తిగా లీగల్ ఆథరైజేషన్‌గానే దేశ వ్యతిరేక, ఎల్‌డబ్ల్యూడీ సంబంధించిన చర్యలు చేపట్టినట్టు తేల్చిందని చెప్పారు. విపక్షాలు (ఆనాడు కాంగ్రెస్ నేతలు) చేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరాధారమని 27.10.2023న కేంద్ర ఎన్నికల సంఘానికి డీజీపీ రిపోర్ట్ ఇచ్చినట్టు వివరించారు.

హార్డ్ డిస్క్ తొలగించారని ఆదేశాలు ఎవరిచ్చారు?

ఈ సుదీర్ఘ వాదనల మధ్య జస్టిస్ ఆర్ మహదేవన్ పిటనర్ న్యాయవాది రంజిత్ కుమార్‌కు పలు ప్రశ్నలు సందించారు. 'మీరు దాదాపు 26 హార్డ్ డ్రైవ్‌లను తీసివేశారు. పాస్‌వర్డ్ ఇవ్వమని మిమ్మల్ని ఆదేశించినప్పుడు మీరు ప్రతిదీ మర్చిపోయారని చెప్పారు. తరువాత గుర్తుంచుకోగలిగారు. వారు దాన్ని యాక్సెస్ చేసినప్పుడు ఏమీ అందుబాటులో లేదు. అందులో ఎలాంటి సమాచారం లేదు. ఇది క్రైం కదా?' అని ప్రశ్నించారు. ఇది ఐటీ యాక్ట్ కిందకు వస్తుందని జస్టిస్ నాగ రత్న గుర్తు చేశారు. దీనికి రంజిత్‌కుమార్ స్పందిస్తూ%ొ% మరోసారి కేసులోని అఫిడవిట్, ఇతర అంశాలను ప్రస్తావించేందుకు ప్రయత్నించారు. దీంతో జస్టిస్ మహదేవన్ జోక్యం చేసుకొని.. మిమ్మల్ని సింగల్ లైన్ ఆన్సర్ అడుగుతున్నాను అంటూ 'హార్డ్ డిస్క్‌లలో డేటా తొలగించాలని మీకు లిఖిత పూర్వక ఆదేశాలు ఎవరైనా ఇచ్చారా ?. ఆ ఆదేశాల ప్రతులు చూపండి. మీకు హార్డ్ డిస్క్‌లు తొలగించాలని ఆదేశాలు ఉండొచ్చు. కానీ ఆ హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయమని కాదు' అని అన్నారు. డిసెంబర్ 2, 2023 కు ముందు ఈ డేటా మొత్తం రివ్యూ కమిటీ వద్ద ఉంటుందని రంజిత్ కుమార్ బదులిచ్చారు. దీనిపై వారికి యాక్సెస్ లేదని ఆ కమిటీ దగ్గర ఉన్నందున వారు మాత్రమే ఈ సమాచారం ఇవ్వగలరన్నారు.

## నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మంత్రి సురేఖ తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. ఈ కేసు విచారణకు ఆమె హాజరు కాలేదు. దీంతో నాంపల్లి కోర్టు ఆమెపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా కొండా సురేఖ ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కాకపోవడంపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిస్థితిని వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలించినట్టు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్ క్యాస్టింగ్ మానిటరింగ్ వ్యవస్థను పరిశీలిస్తూ ఆయన అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,**

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టితో పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మొత్తం పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సమగ్రంగా సాగేందుకు నిరంతర మానిటరింగ్ అవసరం అని అన్నారు. వెబ్ క్యాస్టింగ్ సహాయంతో ఏదైనా అంతరాయం, సాంకేతిక సమస్యలు, లేదా అసాధారణ కదలికలు గమనించిన వెంటనే ఫీల్డ్ స్థాయి అధికారులను అప్రమత్తం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా సూచించినట్టు వెల్లడించారు. అధికారులు కేంద్రాల వారీగా అందుతున్న వీడియో ఫీడ్‌ను పరిశీలించి అవసరమైన చర్యలను చర్చించారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, ఈడియం రవి, వెబ్ క్యాస్టింగ్ ఆపరేటర్లు, సాంకేతిక బృందాలు పాల్గొన్నారు.

# జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తిగా శాంతియుతంగా, సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.







అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి గురువారం సిరికొండ, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పోలింగ్ పరిస్థితులను సమీక్షించారు. ముందుగా సిరికొండ మండలం సుంకిడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ శాతం పెరిగేలా, ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వందశాతం పోలింగ్ సాధనే లక్ష్యంగా మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓటరు సహాయ కేంద్రం వద్ద ఓటర్ స్లిప్ పంపిణీపై బూత్ స్థాయి అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. తరువాత ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నమూనా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి పోలింగ్ ప్రక్రియ, సిబ్బంది నిర్వాహణ, లాజిస్టిక్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేసారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,**

ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల పోలింగ్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రశాంతంగా సాగుతోందని తెలిపారు. అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేశామని చెప్పారు. 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, అలాగే ఓటర్ స్లిప్ చూపించి ఓటు వేయవచ్చని, ఈ విషయంపై బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు ముందుగా అవగాహన కల్పించామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి ఓటరును పోలింగ్ బూత్ వద్దకు చేర్చేందుకు యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. సమస్యాత్మక బూత్‌లను ప్రత్యేకంగా గుర్తించి, వాటిలోని పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్ ద్వారా కలెక్టర్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ పరిశీలనలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, డీఆర్డీఓ రవీందర్, సిరికొండ తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవోలు రాయిస్‌ఉల్లా, రామ్ ప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్, ఇంద్రవెల్లి ఎంపీడీవో జీవన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

# ఎన్నికలు నిర్విఘ్నంగా, శాంతియుతంగా సాగాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





పరిశీలిస్తున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ఎటువంటి అంతరాయం లేకుండా ప్రశాంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులు సూచించారు. గురువారం కలెక్టర్ మామడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, వరుసలో నిల్చొని ఓటు వేయడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వారికి అందిస్తున్న సౌకర్యాలు తగిన విధంగా ఉన్నాయా అని తెలుసుకున్నారు. దివ్యాంగులకు వీల్‌చైర్ సదుపాయం అందుబాటులో ఉందా అనే విషయంపై అధికారులను ప్రశ్నించారు. పోలింగ్ బూత్‌లను ఒక్కొటిగా పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతున్నదో లేదో ఆరాతీశారు. ఫారమ్‌లు, రికార్డులు, ఓటింగ్ వివరాలు రియల్ టైమ్‌లో నమోదు చేసి పై అధికారులకు అందజేయాలని సూచించారు. ఓటింగ్ ముగిసిన వెంటనే లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి ఫలితాలను వెంటనే ప్రకటించాల్సిందిగా ఆదేశించారు. పోలింగ్ పూర్తయ్యేంతవరకూ పటిష్ట బందోబస్తు కొనసాగించాలని పోలీస్ అధికారులకు సూచించారు. సహాయ కేంద్రం, వైద్య శిబిరాలను పరిశీలించిన కలెక్టర్, జిల్లాలో ప్రతి అర్హుడూ ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం అని తెలిపారు.

దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్లు, త్రాగునీరు, టెంట్లు, విశ్రాంతి సదుపాయాలు వంటి అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామని వివరించారు. ప్రజలు అందరూ తప్పకుండా గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర చరిత్రలో గ్రామంలో ఒకే ఒక వార్డుకు ఎన్నిక



యాదగిరిగుట్ట రూరల్ అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎక్కడలేని విధంగా ఎనిమిది వార్డులలో ఒకే ఒక వార్డుకు ఎన్నిక నిర్వహించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, ఏడు వార్డ్ సభ్యుల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. గురువారం, యాదగిరిగుట్ట మండలం మైలార్ గూడెం, సర్పంచ్ గా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన మారెడ్డి కొండల్ రెడ్డి ఏకగ్రీవం, ఉప సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన బండి అశోక్ ఏకగ్రీవం, ఏడు వార్డు నెంబర్లు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన మూడవ వార్డుకు ఎన్నికలు నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నాతి నరసింహా అత్యధిక మెజారిటీతో సాధించారు. ఏకగ్రీవమైన వార్డు సభ్యులు గోపాల పద్మ, కాదూరి లలిత, గుండ్లపల్లి కవిత, చిన్నం గణేష్, రాపోలు సతీష్ రెడ్డి, అల్లం మానస ఉన్నారు. ఎన్నికైన వారిని గ్రామ ప్రజలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కొండల్ రెడ్డి, బండి అశోక్ లు మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామని అన్నారు. స్థానిక నాయకులతో, ఆలేరు ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాను ప్రకాష్, యాదగిరిగుట్ట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కాటంరాజు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పలు ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం.






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో గురువారం జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా, పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పెంబి మండలంలోని ధూమధారి, గుమ్మెణ గ్రామాల్లో, ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి, తర్లపాడ్, గోసంపల్లి, దిలావర్ పూర్ గ్రామాలతో పాటుగా, మమడ మండలంలోని దిమ్మదుర్తి గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు తనిఖీ చేశారు. ఎన్నికల సరళిని పరిశీలించి, పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు.

# ఎన్నికల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి గురువారం సాయంత్రం లక్ష్మణచందా మండలం వడ్యాల్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు అక్కడ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఓటర్లు, పోలైన ఓట్లు, అందులో చెల్లిన ఓట్లు, చెల్లని ఓట్లు, నోటా ఓట్ల వివరాలు తెలుసుకున్నారు అనంతరం ఉ పసర్పంచ్ ఎన్నిక ప్రక్రియ

మొత్తాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసిల్దార్ సరిత, ఇతర అధికారులు, సిబ్బంది, ఉన్నారు.

# అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం మాజీ డిసిసి అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు



కుస్లి ఎన్నికల ప్రచారంలో మాజీ డిసిసి అధ్యక్షులు జిల్లా ఇంచార్జ్ శ్రీహరి రావు,ను సన్మానిస్తున్న సర్పంచ్ అభ్యర్థి గణేష్ పటేల్,



నర్సాపూర్ జి సర్పంచ్ అభ్యర్థి గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి తో మాజీ డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు,

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి డిసెంబర్ 11 అమృత్ తెలంగాణ, మాజీ డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు, మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు సామాన్య ప్రతి పౌరుడికి అందాలంటే స్థానిక సంస్థలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు, అన్నారు. నర్సాపూర్ (జి) మండలం కుస్లి, ప్రేమ్ నగర్ తండా గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి, ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని, ఇంకా గ్రామం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైనా నాటి నుంచి మహాలక్ష్మి పథకం అమలు, చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం, రాజీవ్ యువవికాసం, పంట రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, ఉచిత విద్యుత్, రైతు బీమా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు నేస్తం, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు, సన్నబియ్యం తదితర పథకాలు అమలు చేస్తుందని కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు నర్సాపూర్ జి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి,. కుస్లీ, గ్రామపంచాయతీ అభ్యర్థి నర్వాడి గణేష్ పటేల్,ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు

# ఒక్క అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా : సర్పంచ్ అభ్యర్థి బార్కుంట నరేందర్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి డిసెంబర్ 11 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం లో బిజెపి బలపరిచిన అభ్యర్థి బర్కుంట నరేందర్, ను ఫుట్బాల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారితో గెలిపిచాలని కోరుతూ మెడిసెమ్మే రాజు, గ్రామ ప్రజలను కోరారు.. 15 సంవత్సరాల నుండి సామాజిక కార్యకర్తగా ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొని, ఊరిలోని బడి, గుడి, ఆసుపత్రి కి సరియైన వసతులు, కనీస అవసరాలు అందేలా చూస్తానని, నిజమైన లబ్ధిదారులకు లబ్దిచేకూరెలా చేస్తానని, గ్రామ అభివృద్ధికి బీజేఎల్పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ద్వారా నిధులు మంజూరు చేయిస్తాన ని అన్నారు...ఈ ప్రచారం లో నరేంద్ర చారి, రాజేందర్,దత్తురాం, గంగారాం వార్డ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు...

# డాక్టర్ సాప పండరికి ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు



డాక్టర్ సఫా పండరికి అబ్దుల్ కలాం అవార్డు అందజేస్తున్న దృశ్యం



పుత్రుడు చేసిన సత్కార్యాలకు తండ్రి సాప భూమన్నకు శాలువాతో ఘనంగా సన్మానించి ప్రముఖులు

నిర్మల్ జిల్లా కుబీర్ డిసెంబర్ 11 అమృత్ తెలంగాణ హైదరాబాదులో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం డిసెంబర్ 10 ని పురస్కరించుకొని




అబ్దుల్ కలాం అవార్డు

హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్ నందు నిర్వహించిన"""మానవ హక్కుల దినోత్సవం వేడుకలలో""""భాగంగా సామాజిక సేవకుడైన డాక్టర్ సాప పండరికి ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అరుదైన అవార్డు లభించింది. ఈ అవార్డును ముఖ్య అతిథులైన డాక్టర్ హిప్నో పద్మ కమలాకర్, కృష్ణమూర్తి అడిషనల్ ఎస్పి నారోటిక్స్ బ్యూరో అండ్ డిసిపి, శ్రీనివాసరావు యాంటీ నారోటిక్స్ ఇన్స్పెక్టర్ హెడ్ ఆఫీస్, సైదులు ఆంటీ నేరోటిక్స్ సబ్ ఇన్స్పెక్టర్ హెడ్ ఆఫీస్, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్, ప్రతినిధులు నేషనల్ జనరల్ సెక్రటరీ గంప హనుమ గౌడ్, సౌత్ ఇండియా చైర్మన్ వై వై రాజు, సౌత్ ఇండియా వర్కింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ నోముల సంపత్ గౌడ్, ప్రముఖ న్యాయవాదులు కడారి రమేష్, సుజిత్ కుమార్ పలువురు పాల్గొన్నారు

# విట్టోలి తండా సర్పంచ్ రాథోడ్ జయశ్రీ కాంతారావు, ఏకగ్రీవం

## మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, నీ మర్యాద పూర్వకంగా కలిసిన నూతన సర్పంచ్ గ్రామస్తులు



మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డిని మర్యాద పూర్వంకంగా కలిసిన ఏకాగ్రీవంగా ఎన్నుకోబడిన నూతన సర్పంచ్ వార్డు మెంబర్లు

నిర్మల్ జిల్లా ముధోల్ డిసెంబర్ 11 అమృత్ తెలంగాణ ముధోల్ మండలంలోని విట్టోలి తండా, గ్రామా సర్పంచ్ గ రాథోడ్ జయశ్రీ కాంతారావు, ను వాడు మెంబర్లను ఏకగ్రీవంగ ఎన్నుకున్న గ్రామస్తులు వార్డు సభ్యులు పవర్ పాండు,పవర్ రాజేష్,జాదవ్ సంతోష్, రాథోడ్ శంకర్, గ్రామస్తులు గురువారం మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి,ని మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ వార్డు సభ్యులకు శాలువలతో సత్కరించి వారికీ శు భాకాంక్షలు తెలియచేసి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలనీ కోరారు.వారితో పాటు గ్రామస్తులు రాథోడ్ పాండు, జాదవ్ జై వంత రావు,పవర్ శ్యామ్,పవర్ శివాజీ, రాథోడ్ ప్రకాష్,రాథోడ్ శ్యామ్, రాథోడ్ రోహిదాస్, రాథోడ్ అర్జున్, జీవన్ మరియు మాజీ ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ మాజీ జెడ్పిటిసి సురేందర్ రెడ్డి మరియు మగ్గం మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి,నాగేష్ పటేల్, మాణిక్ రావు, సురేష్ మరియు తదితరులు ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్ పై పార్లమెంట్లో చర్చించాలి

**50 శాతం రిజర్వేషన్ పరిమితి తొలగించేలా చర్యలు చేపట్టాలి**
**42 శాతం రిజర్వేషన్ అమలు కోసం 9వ షెడ్యూల్ లో చేర్చాలి...**
**మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి..**






జగిత్యాల అమృత్ తెలంగాణ డిసెంబర్ 11: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర సాధన మాదిరిగానే 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయి విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించబడేవిధంగా రాహుల్ గాంధీ ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చట్టం కూడ చేసింది.గతంలో 50 శాతంరిజర్వేషన్ పరిమితి తొలగించి, రిజర్వేషన్లు అమలుకు కృషి చేయాలి.గ్రామ పంచాయతీ లకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు పొందలేకపోతున్నాం.తమిళ నాడులో రిజర్వేషన్స్ అమలు చేస్తున్న విధముగా 42 శాతం రిజర్వేషన్ 9 వ షెడ్యూల్ లో చేర్చాలి.42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే రాహూల్ గాంధీ ఆలోచనను కాంగ్రెస్ పార్టీ తెరపైకి తీసుకువచ్చింది.సామాజికంగా వెనకబాటు తనానికి గురి అవుతున్న బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి.అన్ని రాజకీయ పార్టీలు 42 శాతం రిజర్వేషన్ అమలుకు అనుకూలమని, చెబుతున్న నేపథ్యంలో రిజర్వేషన్లు అచరణలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాలి 50 శాతం పరిమితి అధిగమించేందుకు 42 శాతం రిజర్వేషన్ అమలును 9వ షెడ్యూల్ లో చేర్చాలి బలహీన వర్గాల తరపున ఆర్ కృష్ణయ్య చేస్తున్న పోరాటం అభినందనీయం. అన్ని రాజకీయ పార్టీలను సమన్వయ పరిచి, లోకసభ, రాజ్యసభలో చర్చించే అంశంగా లేవనెతెల ఆర్ కృష్ణయ్య చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న.. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థల కి పరిమితమైంది కాదు. విద్యా, ఉద్యోగాల్లో అమలు చేయడం ప్రధానమైంది. శీతాకాల సమావేశాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం చొరవ తీసుకోవాలి.బలహీన వర్గాల జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం అన్ని రాజకీయ పార్టీలపై బాధ్యత ఉన్నది..స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పాలనా కాలంలో కేంద్రం నుండి నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు అందేలా చర్యలు చేపట్టారు అని జీవన్ రెడ్డి గుర్తు చేశారు.

# గోధుర్ సర్పంచుగా బండి రాజేష్ భారీ మెజార్టీతో విజయం

## ఉప సర్పంచ్ గా ఓంకార్ లక్ష్మణ్




గోధూర్ సర్పంచ్ గా బండి రాజేష్

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ డిసెంబర్ 11 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గూడూరు గ్రామంలో మొదటి విడత లో ఈరోజు జరిగిన ఎలక్షన్ లో కాంగ్రెస్ అభ్యర్థి బండి రాజేష్ భారీ మెజార్టీతో విజయం సాధించారు మొత్తము3016 ఓట్లు ఉండగా అందులో 2376 ఓట్లు పోలయ్యాయి, అందులో బండి రాజేష్ కు 2085 ఓట్లు వచ్చాయి ప్రత్యర్థులకు ఎడపల్లివెంకటస్వామికి 211 బుదుతఐజాక్ 40 ఓట్లు13నోటా కు 7 చెల్లని ఓట్లు పోలయ్యాయి బండి రాజేష్ 1814 ఓట్ల భారీ రికార్డు మెజార్టీతో గెలుపొందాడు బండి రాజేష్ ను గ్రామ ప్రజలు అభినందించారు బండి రాజేష్ మాట్లాడుతూ ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు అలాగే 12 వార్డులలో 12 వార్డులలో 7 ఏకగ్రీవం కాగా ఐదు వార్డులకు ఎలక్షన్ జరిగాయి అందులో ఒకటో వార్డు మెంబర్గా రాజ్యలక్ష్మి మూడో వార్డ్ బురం వసంత నాలుగవ వార్డు ఓంకార్ లక్ష్మణ్ ఏడవ వార్డులో పురుషోత్తం 12వ వార్డులో అసాద్ గెలుపొందారు ఉప సర్పంచ్ గా ఓంకారి లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు



గోదురు ఉప సర్పంచ్ గా ఓంకార్ లక్ష్మణ్

# మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**జిల్లాలో ఆరు మండలాలలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు.**
**166 గ్రామపంచాయతీలలో 938 సిబ్బందితో పటిష్ట బందోబస్తు ప్రక్రియ.**
**ఎన్నిక అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదు.**






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లా నందు ఇచ్చోడ, సిరికొండ,ఉట్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్ ఆరు మండలాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ పరిశీలించారు. ఆరు మండలాలలో ప్రత్యేకంగా డిఎస్పి స్థాయి అధికారులను నియమించి ఎన్నికలను పర్యవేక్షించారు. ప్రతి మండలంలోని ప్రతి పోలింగ్ స్టేషన్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలలో స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు నిర్వహించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని తదుపరి సంబంధిత అధికారుల అనుమతుల మేరకు నిర్దేశించిన రోజున టపాకాయలు లేకుండా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవచ్చు అని తెలిపారు.


# సర్పంచ్ అభ్యర్థుల తరుపున కంది శ్రీనివాస రెడ్డి ప్రచారం.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ బేల మండలంలో గురువారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పర్యటించారు. మండలంలోని దహెగావ్ గ్రామాన్ని సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి భోక్రె శంకర్ ని భారీ మెజార్టీ తో గెలిపించాలని కంది శ్రీనివాస రెడ్డి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేసారు..అనంతరం కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గార్ల అండదండలతో గ్రామాలని అభివృద్ధి చేసుకుందామన్నారు. అన్ని గ్రామపంచాయితీలలో కాంగ్రెస్ బలపరచిన సర్పంచ్ అభ్యర్దులను గెలిపించుకోవాలని అందరు విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఎప్పుడు ఎలాంటి అవసరమొచ్చినా తాను అండగా ఉంటానని అందరం కలిసి గ్రామాల సమస్యలను పరిష్కరించుకొని అభివృద్ధి దిశగా పయనింప చేద్దామన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్

## ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీస్ బందోబస్తు
## కొన్నసాగుతున్న ఓట్ల లెక్కింపు పక్రియ... గ్రామాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు
## విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధం
## జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి. నిర్మల్ జిల్లా పరిధిలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తిగా ప్రశాంత వాతావరణంలో సాగిందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ వెల్లడించారు.ఎన్నికల పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో అదనపు పోలీసు బలగాలను మోహరించామని, లెక్కింపు కేంద్రాల పరిసరాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవాల ర్యాలీలకు అనుమతి లేదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. నియమావళి ఉల్లంఘనకు ఎవరూ ప్రయత్నించకూడదని, ప్రజలు మరియు అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



వలిగొండ రూరల్ :అమృత్ తెలంగాణ: గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు భీర్ల ఐలయ్య అన్నారు. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో బాగంగా ఆయన గురువారం మండలంలోని నర్సాపురం, దుప్పెల్లి గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులతో కావటి ధనలక్ష్మి, బీసు వెంకయ్య లతో కలిసి ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే లక్షల కోట్లు దోచుకొని రాష్ట్రాన్ని అప్పులకుంపటిలోకి నెట్టారని, పది సంవత్సరాల పాలనలో ఒక్క రేషన్ కార్డు, ఇండ్లు లేని పేదలకు ఒక్క ఇల్లు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనలో రైతులకు 2 లక్షల రుణ మాఫీ,సాగు నీటి కాల్వల అభివృద్ధి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు పథం లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలుచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కావాటి మాచగిరి, నరేష్, దేవేందర్, పీసరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, పిలుపు..



మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి


నిర్మల్ జిల్లా ముధోల్ డిసెంబర్ 11 అమృత్ తెలంగాణ ముధోల్ నియోజకవర్గ ఓటర్ మహాశయులకు, మహిళా సోదరీమణులకు, యువకులకు విజ్ఞప్తి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు, వార్డ్ మెంబర్లకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాను. తొలి విడత 11 డిసెంబర్ జరిగిన గ్రామాలలో కాంగ్రెస్ పార్టీని ఓటర్ మహాశయులు అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులను వార్డ్ మెంబర్లను గెలిపించారు.లి ఇప్పుడు జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాను

# అబ్బా నభా ఆ కొంటె చూపుతో పడేశావ్




సుదీర్ బాబు హీరోగా నటించిన నన్ను దోచుకుందువటే సినిమా తో హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. మొదటి సినిమాతోనే మంచి పేరును దక్కించుకుంది. అందంతో పాటు మంచి నటన ప్రతిభ ఉన్న హీరోయిన్ ఇండస్ట్రీకి దొరికింది అంటూ చాలా మంది ఆ సమయంలో ఆమెపై ప్రశంసల వర్షం కురిపించడం జరిగింది. ఆ సినిమా తర్వాత తెలుగు లో వరుసగా ఆఫర్లు వచ్చాయి. చిన్నా చితకా ఆఫర్లు చేస్తున్న సమయంలో డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ హీరోగా రూపొందిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో హీరోయిన్ గా ఛాన్స్ దక్కింది. ఆ సినిమాలో మరో హీరోయిన్ ఉన్నా కూడా ఈమె డామినేషన్ క్లీయర్ గా కనిపించింది. ముద్దుగుమ్మ నభా ఇస్మార్ట్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత రవితేజ తో కలిసి నటించే అవకాశం దక్కించుకుంది. అంతే కాకుండా సోలో బ్రతుకే సో బెటర్ ఇంకా అల్లుడు అదుర్స్.. మాస్ట్రో ఇలా పలు సినిమాల్లో ఛాన్స్ దక్కించుకుంది. కానీ సక్సెస్ అవ్వలేక పోయింది. దాంతో ఈ మధ్య ఆఫర్లు రావడం లేదు. అయినా కూడా ఈ అమ్మడి సోషల్ మీడియా జోరు మాత్రం కంటిన్యూ అవుతోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అలా ఓర కంట చూస్తూ.. నాలుక బయటకు పెట్టి కవ్విస్తున్న ఈఅమ్మడిని చూస్తూ ఎవరికైనా కూడా బాబోయ్ అనిపించాల్సిందే. కొంటె చూపుతో ఈ అమ్మడు పడేస్తోంది అంటూ ఈ ఫోటో కు తెగ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ పోటో తెగ వైరల్ అవుతోంది.

# 'పాపతో పైలం'.. మాస్ ఐటమ్ సాంగ్ తో మొదలైన మ్యూజికల్ 'హంట్'..!




నైట్రో స్టార్ సుధీర్ బాబు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ స్పెషల్ యాక్షన్ థ్రిల్లర్ "హంట్". 'గన్స్ డోన్ట్ లై' అనే ట్యాగ్ లైన్ తో రూపొందుతున్న ఈ సినిమాలో అతను యాక్షన్ ప్యాక్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నాడు. ఇందులో 'ప్రేమిస్తే' భరత్ – సీనియర్ నటుడు శ్రీకాంత్ మేకా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'హంట్' ప్రచార చిత్రాలు మరియు టీజర్ అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాలోని 'పాపతో పైలం' అనే ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియోని లాంచ్ చేయడంతో మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. 'పాపతో పైలం' అనేది ఎనర్జిటిక్ ఐటమ్ నంబర్ అని చెప్పాలి. ఇందులో క్రాక్ బ్యూటీ అప్సర రాణి ఐటమ్ భామగా ఆడిపాడింది. సుధీర్ బాబుతో పాటుగా శ్రీకాంత్ మరియు భరత్ కూడా ఈ పాటలో కనిపించారు. మ్యూజిక్ డైరెక్టర్ జిబ్రాన్ ఎనర్జిటిక్ కంపోజిషన్ లో వచ్చిన ఈ డ్యాన్స్ నంబర్ మాస్ ని బాగా ఆకట్టుకుంటోంది. సింగర్స్ మంగిలి మరియు నకాష్ అజీజ్ తమదైన శైలిలో హుషారుగా ఆలపించారు. గీత రచయిత కాసర్ల శ్యామ్ ఈ పాటకు లిరిక్స్ అందించారు. స్పెషల్ సెట్ లో షూట్ చేసిన ఈ పార్టీ సాంగ్ లో సుధీర్ మరియు అప్సర తమ స్టెప్పులతో డ్యాన్స్ ఫ్లోర్ ను కదిలించారు. భరత్ – శ్రీకాంత్ కూడా వీరికి సహకారం అందించారు. తన హాట్ హాట్ డ్యాన్సులతో భూమ్ బద్దల్ కొట్టే అప్సర.. ఈసారి పటాకా సాంగ్ లో మాస్ స్టెప్స్ తో వేట సాగించింది. "హంట్" చిత్రానికి మహేష్ దర్శకత్వం వహిస్తుండగా.. భవ్య క్రియేషన్స్ పతాకంపై వి. ఆనంద ప్రసాద్ నిర్మిస్తున్నారు. అరుల్ విన్సెంట్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. వివేక్ అన్నామలై ఆర్ట్ డైరెక్టర్ గా.. ప్రవీణ్ పూడి ఎడిటర్ గా వర్క్ చేస్తున్నారు. ఇకపోతే 'ముంబై పోలీస్' అనే మలయాళ చిత్రానికి రీమేక్ గా "హంట్" తెరకెక్కుతోందని వార్తలు వస్తున్నాయి. 2013 లో పృథ్వీరాజ్ సుకుమారన్ – రెహమాన్ – జయసూర్య ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మిస్టరీ థ్రిల్లర్ సూపర్ హిట్ గా నిలిచింది. ఇప్పుడు అదే చిత్రాన్ని సుధీర్ బాబు – శ్రీకాంత్ – భరత్ లతో రీమేక్ చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. 'హంట్' మేకర్స్ మాత్రం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. టీజర్ ని బట్టి చూస్తే నిజమే అనిపిస్తోంది. ఇటీవల కాలంలో మలయాళ రీమేక్స్ తెలుగులో బాగానే వర్కవుట్ అవుతున్నాయి. మన నేటివిటీ మరియు తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా మార్పులు చేర్పులు చేసి హిట్టు కొడుతున్నారు. 'ప్రేమమ్' చిత్రాన్ని తెలుగుకు తగ్గట్టుగా తీసి డైరెక్టర్ చందూ మొండేటి సూపర్ హిట్ అందుకున్నాడు. త్రివిక్రమ్ శ్రీనివాస్ సహకారంతో 'భీమ్లా నాయక్' సినిమాని తెరకెక్కించి సాగర్ కె చంద్ర పర్వాలేదనిపించాడు. లేటెస్టుగా వచ్చిన 'గాడ్ ఫాదర్' సినిమా కూడా సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. దర్శకుడు మోహన్ రాజా చేసిన చేంజెస్ తెలుగు ఆడియన్స్ ని ఆకట్టుకున్నాయి. సుధీర్ బాబు "హంట్" సినిమా కూడా మలయాళ రీమేక్ అయితే.. తెలుగుకు తగ్గట్టుగా మార్పులు చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఒరిజినల్ లో లేని విధంగా 'పాపతో పైలం' వంటి మాస్ ని ఆకట్టుకునే డ్యాన్స్ నంబర్ ని పెట్టారు. మరి త్వరలోనే రిలీజ్ కాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.


# లైంగిక అవయవం గుండె లేదా మెదడు లాంటిది!



కథల విషయంలో ప్రయోగం చేయాలంటే బాలీవుడ్ యువహీరో ఆయుష్మాన్ ఖురానా తర్వాతే. విక్కీ డోనర్ మొదలు నేటి రిలీజ్ డాక్టర్ జి వరకూ అతడు ఎంచుకున్న దారి వేరు. ఇప్పుడు మేల్ గైనకాలజిస్ట్ పాత్రలో అతడు మరో ప్రయోగం చేసాడు. ఇందులో రకుల్ ప్రీత్ సింగ్ కథానాయిక. ప్రస్తుతం టీమ్ ప్రచారంలో బిజీబిజీగా ఉంది. ఓ ఇంటర్వ్యూలో రకుల్ ప్రీత్ సింగ్ వ్యాఖ్యలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. డాక్టర్ జి మూవీ ప్రారంభం నుండి హెడ్ లైన్స్ లో నిలుస్తోంది. ఈ సినిమా కాస్టింగ్ కథాంశం సహా ప్రతిదీ చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా దాని కథ లో మ్యాటర్ ప్రతిసారీ చర్చకు వస్తోంది. భారతదేశంలో మగ గైనకాలజిస్ట్ పాట్లు ఎలా ఉంటాయనేదే ఈ సినిమా కాన్సెప్టు. ఇది ఒక రకంగా యుక్తవయస్కుల లోగుట్టును ధైర్యంగా వివరించే ప్రయత్నం. ఆయుష్మాన్ ఖురానా– రకుల్ జంటగా నటించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. అందాల కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ .. యుక్తవయసులో మగ గైనకాలజిస్ట్ వద్దకు వెళ్లడానికి సిగ్గుపడ్డట్లు వెల్లడించింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# బ్లాక్ బికినీలో భగభగ మరిగించిన రష్మిక



గత కొద్దిరోజులుగా రష్మిక మందన ఒంటరి దీవుల విహారం సంచలనంగా మారింది. అయితే ఈ విహారం ఒంటరిగానా జంటగానా? అనేదే అందరి సందేహం. అక్కడ ఒంటరిగా విహారం చేయడం లేదని తనతో పాటే ఒక ప్రముఖ యువహీరోతో జంటగా షికార్ చేస్తోందని గుసగుసలు వేడెక్కిస్తున్నాయి. అతడు ఉపయోగించిన సన్ గ్లాసెస్ నే తాను కూడా ధరించడంతో బాలా కుమారి ఇట్టే దొరికిపోయింది. విమానాశ్రయంలో వెళ్లేప్పుడు విడివిడిగా కనిపించినా మాల్దీవుల నుంచి లోన్ లీ ఫోటోలు షేర్ చేసినా కానీ ప్రస్తుతం ఈ భామ వ్యవహారాలపై ఎవరికీ నమ్మకం కుదరడం లేదు. ఎవరి సందేహాలు వాళ్లకు ఉన్నాయి. రష్మిక నుండి విటమిన్ సీ రోజువారీ మోతాదుకు సంబంధించిన టోన్డ్ ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారుతున్నాయి. రష్మిక గత వారం మాల్దీవుల బీచ్ నుంచి అరుదైన ఫోటోలను షేర్ చేస్తోంది. కొద్దిసేపటి క్రితం మరో రెండు ఫోటోలను పోస్ట్ చేసింది. రష్మిక నల్లటి టూ–పీస్ లో ధడ పుట్టించింది. బికినీ బాడీని కవరప్ చేస్తూ పైన నార చొక్కా ధరించింది. ఎండలో అందమైన అల్లికతో ఉన్న హ్యాట్ ని ధరించింది. వీటన్నిటికీ మించి రష్మిక అలా కాలిపై కాలు వేసుకుని కూచున్న తీరు యువతరాన్ని ఆకర్షించింది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com